
నేడు



వెలవెలబోతున్న చందూర్ బతుకమ్మ చెరువు

లక్ష్మీసాగర్ తండా శివారులో ఎండు తున్న పొలం

# పంట చేతికొచ్చేనా?

- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- నెర్రెలు వారుతున్న పొలాలు
- మరో నెల రోజుల పాటు అవసరం
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు

**వరి సాగుచేస్తున్న** రైతుల్లో టెన్షన్ మొదలైంది. భూగర్భ జలాలు తగ్గిపోయాయి. దీంతో బోర్లలో నుంచి నీరు సరిగా రావడం లేదు. పొలం తడపడం రైతులకు కష్టంగా మారింది. పంట చేతికి అందడానికి మరో నెల, నెలన్నర రోజులు పట్టే అవకాశం ఉన్నది. దీంతో అప్పటి వరకు పంటను ఎలా గట్టెక్కించుకోవాలని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండలు అప్పుడే తీవ్రంగా ఉండడంతో పొలాలు నెర్రెలు వాస్తున్నాయి. మండంలోని లక్ష్మీసాగర్ తండా తదితర గ్రామాల్లో పొలాలు పారించేందుకు రైతులు నానా కష్టాలు పడుతున్నారు. కొందరు రైతులు సమీపంలో ఉన్న రైతుల బోరు బావుల నుంచి నీటిని పారిస్తున్నారు. కానీ ముందు పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పెట్టుబడి ఖర్చులు బాగా పెరిగాయని, పంట చేతికి రాకుంటే పరిస్థితి ఏమిటని దిగాలు చెందుతున్నారు. మండలంలో నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకం పనులు ఏడాదిగా కొనసాగుతున్నాయని, ఇప్పటికే పూర్తయితే నీటి తిప్పలు తప్పేవని అభిప్రాయపడుతున్నారు.

–చందూర్, మార్చి 5

నేడు

కళకళలాడుతున్న చందూర్ బతుకమ్మ చెరువు



### మరో నెల రోజులు తడి అవసరం..



నేను డిగ్రీ చదువుకొని ఉద్యోగం కోసం ప్రయత్నం చేశా. ఉద్యోగం రాకపోవడంతో మాకు లక్ష్మాపూర్ గ్రామ మాటు కాలువ తండా శివారులో ఉన్న ఎకరం భూమిలో పొలం సాగుచేస్తున్న. ప్రస్తుతం వరి పొట్ట దశలో ఉన్నది. బోరులో నీరు సరిగా రావడం లేదు. దీంతో పక్క పొలం అతడిని బతిమిలాడి రోజూ రాత్రి పొలానికి నీరు పారిస్తున్న. ఇంకో నెల రోజులు నీరు పారిస్తే తప్ప పొలం బయటపడే పరిస్థితి లేదు. ఏమవుతుందోనని ఆందోళనగా ఉన్నది.

**-పాత్‌లోత్ వసంత్, ఘన్‌పూర్, యువరైతు**

### లిఫ్ట్ పనులు త్వరగా పూర్తయితే బాగుండె..



లిఫ్ట్ పనులు సంవత్సరం నుంచి సాగుతున్నాయి. అవి పూర్తయ్యేదెప్పుడో..? పంటలకు నీరు అందేది ఎప్పుడో..? మాకు లక్ష్మీసాగర్ తండాలో ఉన్న నాలుగు ఎకరాల్లో పొలం సాగుచేస్తున్న. ఎండలు మండుతున్నాయి. మరో నెల రోజుల్లో ఎండలు ఇంకా ముదురుతాయని అధికారులు అంటున్నరు. ప్రస్తుతం బోర్లలో అంతంతమాత్రంగానే నీరు వస్తున్నది. ఇప్పటికే పెట్టుబడి బాగా అయ్యింది.

**-లకావత్ శంకర్, మేడ్‌పల్లి, రైతు**

# పంట ఎండే.. గుండె చెదిరే

- రైతు ఆత్మహత్యాయత్నం
- అడ్డుకున్న తోటి రైతులు
- అధికారులు స్పందించాలని రైతుల వేడుకోలు



జాడిజమాల్‌పూర్ గ్రామ శివారులోని పొలంలో ఏర్పడిన పగుళ్లు

బోధన్ రూరల్, మార్చి 5: నిజాంసాగర్ డీ–28కెనాల్ పరిధిలోని 15సబ్ కెనాల్ కింద రైతులు సాగుచేస్తున్న పంటలకు నీరు అందక ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన రైతు గురునాథం బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన తోటి రైతులు వెంటనే అతడి చేతిలోని పురుగుల మందు డబ్బాను లాగేసుకున్నారు. బోధన్ మండలంలోని రాంపూర్, సాలూర మండలంలోని జాడిజమాల్‌పూర్ గ్రామ శివారులో సుమారు 50 ఎకరాల్లో పంటలకు నిజాంసాగర్ ప్రాజెక్టు నీరు సరఫరా కావడం లేదు. సాలూర మండలంలోని కొప్పర్తిక్యాంప్ మాజీ సర్పంచ్ గురునాథం జాడిజమాల్‌పూర్ శివారులో ఆరున్నర ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. నిజాంసాగర్ ప్రాజెక్టులో పుష్కలంగా నీరు ఉండడంతో సాగునీటికి ఢోకాలేదని వరి సాగుచేశాడు. ప్రస్తుతం వరి పొట్ట దశలో ఉండగా.. అధికారుల నిర్లక్ష్యంతో సాగునీరు అందడం లేదు. ఉన్న రెండు బోర్లు కూడా ఎత్తివేశాయి. అప్పు చేసి పంట సాగుచేయగా.. పెట్టుబడి కూడా చేతికి వచ్చే పరిస్థితి లేక, పంట ఎండిపోవడంతో తీవ్ర ఆందోళనతో రైతు గురునాథం పురుగుల మందు తాగడానికి బాటిల్ పట్టుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల రైతులు చూసి మందు డబ్బాను లాగేశారు. చివరి ఆయకట్టుకు సాగునీరు అందించాలని అధికారులకు పలు మార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతు వాపోయాడు. కలెక్టర్ ఇటీవల అధికారులతో నిర్వహించిన సమీక్షలో కూడా నిజాంసాగర్ చివరి ఆయకట్టుకు నీరు అందిస్తామని చెప్పారని, అయినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిజాంసాగర్ నీటిని విడుదల చేసి ఇప్పటికీ 12రోజులు అవుతున్నా.. చివరి ఆయకట్టుకు నీళ్లు రావడం లేదన్నారు. గత ఏడాది చివరి ఆయకట్టుకు పుష్కలంగా నీరు అందిందని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని రైతులు కోరుతున్నారు.

### చేతికి అందే పంట ఎండిపోతున్నది..



సాలూర మండలం జాడిజమాల్‌పూర్ గ్రామ శివారులో నిజాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు కింద ఆరున్నర ఎకరాల్లో మా నాన్న గురునాథం వరి సాగు చేశాడు. రెండు బోర్లు ఎత్తిపోయాయి. ఇప్పటి వరకు నిజాంసాగర్ కెనాల్ నీళ్లు రాలేదు. పంటలు ఎండిపోతున్నాయి. రూ.లక్షల్లో అప్పు చేసి పంట పెట్టుబడి పెట్టి చేతికి వచ్చే సమయంలో నీళ్లు లేక ఎండే పరిస్థితి ఏర్పడింది. అధికారులకు చెబితే.. ఎగువ ప్రాంతంలో ఉన్న వారు నీటిని వాడుకుంటున్నారని, చెరువులు నింపుకుంటున్నారని చెబుతున్నారు. ఏం చేసుకుంటారో చేసుకోమని అంటున్నారు. ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదు.

**-కృష్ణప్రసాద్, రైతు, కొప్పర్తిక్యాంప్**

## ఏండ్లుగా పరిష్కారం కాని సమస్యలు

**ఎన్డీఎస్ఎల్ ఎదుట కార్మిక సంఘాల నాయకుల ఆందోళన**



ఎన్డీఎస్ఎల్ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

బోధన్, మార్చి 5: ఏండ్లు గడిచినా నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ (ఎన్డీఎస్ఎల్) కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదని, కార్మికులకు చెల్లించాల్సిన వేతన బకాయిలు చెల్లించడం లే దని కార్మిక సంఘాల నాయకులు ఆరోపించా రు. బోధన్ పట్టణం శక్కర్‌నగర్‌లోని ఎన్డీఎస్ఎల్ మెయిన్ గేట్ ఎదుట కార్మిక సంఘాల నాయకులు బుధవారం ఆందోళన చేపట్టారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. నిజాం షుగర్ ఫ్యాక్టరీకి 23 డిసెంబర్, 2015న అర్ధరాత్రి లేఆఫ్ ప్రకటించి, కార్మికుల గొంతు కోశారన్నారు. పదేండ్లుగా వేతనాలు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పలువురు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఫ్యాక్టరీని పునః ప్రారంభిస్తామని చెప్పినా.. అధికారం చేపట్టి 15నెలలు గడుస్తున్నా నేటికీ స్పష్టత లేదని ఆరోపించారు. ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం వేసిన కమిటీ కాలయాపన కమిటీగా మారిందన్నారు. ఫ్యాక్టరీ, కార్మికుల విషయంలో సీఎంను కలిసేందుకు రెండుసార్లు వెళ్లి నా.. కలిసే అవకాశం కల్పించలేరని ఆరోపించా రు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఎన్డీఎస్ఎల్ విషయంలో స్పష్టత ఇవ్వాలని, కార్మికుల బకాయి వేతనాలు, ఇతర బెనిఫిట్లను జాప్యం లేకుండా అందించి ఆదుకోవాలని కోరారు. కార్మిక సంఘం నాయకులు ఉపేందర్, నాగుల రవిశంకర్ గౌడ్, బాలకృష్ణ, ఈరవేణి సత్యనారాయణ, శ్రీనివాస్, రాంబాబు, భాస్కర్ పాల్గొన్నారు.

## దాడి కేసు కొట్టేయండి..

**నిందితుల అభ్యర్థన మేరకు బాజిరెడ్డి రాజీ**

వినాయక్‌నగర్, మార్చి 5: ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ కాన్వాయ్‌పై జరిగిన దాడి కేసును కొట్టివేయాలని నిజామాబాద్ నాల్గో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ (జూనియర్ సివిల్ జడ్జి) వడ్డి హరికుమార్ అవార్డు జారీచేశారు. నిందితుల అభ్యర్థన మేరకు బాజిరెడ్డి గోవర్ధన్ బుధవారం మెజిస్ట్రేట్ ఎదుట హాజరై కేసును సామరస్యంగా పరిష్కరించుకోనున్నట్లు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా 23ఏప్రిల్ 2024లో బాజిరెడ్డి గోవర్ధన్ ఎల్లమ్మకుంట గ్రామానికి వెళ్లారు. అక్కడ ఆయన కాన్వాయ్‌పై కాంగ్రెస్ పార్టీకి చెందిన కెతావత్ మోహన్, కెతావత్ యాదగిరి తదితరులు దాడిచేసి, కారు అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కాగా.. మోహన్, యాదగిరి తదితరుల అభ్యర్థన మేరకు కేసులో రాజీ కుదుర్చుకున్నట్లు మెజిస్ట్రేట్‌కు బాజిరెడ్డి గోవర్ధన్ వివరించారు. దీంతో 8వ తేదీన నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో కేసు కొట్టివేయాలని మెజిస్ట్రేట్ అవార్డును జారీచేశారు. న్యాయవాదులు అల్గోట్ రవీందర్, ఆశ నారాయణ, యూనుస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్‌లోని ఓ పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

# ఇంటర్ పరీక్షలు షురూ!

- నిజామాబాద్‌లో 57, కామారెడ్డిలో 38 కేంద్రాల్లో నిర్వహణ
- నిజామాబాద్ జిల్లాలో 19,191మందికి 18,438మంది, కామారెడ్డి జిల్లాలో 9,230మందికి 8,863మంది విద్యార్థులు హాజరు
- పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్లు

ఖలీల్‌వాడి/ కామారెడ్డి, మార్చి 5: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియెట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ భాషా పరీక్షలు నిర్వహించారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన పరీక్షల కోసం నిజామాబాద్ జిల్లాలో 57, కామారెడ్డి జిల్లాలో 38 సెంటర్లను ఏర్పాటు చేశారు. నిజామాబాద్ జిల్లాలో మొత్తం 19,191మంది విద్యార్థులకు 18,438 మంది హాజరయ్యారని, 753మంది గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి తిరుమలపూడి రవికుమార్ తెలిపారు. మొత్తం 96.1శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు. నగరంలోని నిర్మల హృదయ జూనియర్ కాలేజీని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తనిఖీ చేశారు. విద్యార్థులు పరీక్ష రాస్తున్న తీరును పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. నిజామాబాద్‌లోని ఖిల్లా బాలుర, కంఠేశ్వర్‌లోని ఎస్సార్, సీఎస్ఐ, గోల్డెన్ జూబ్లీ, నిర్మల హృదయ, ఉమెన్స్ జూనియర్ కాలేజీలను జిల్లా ఇంటర్ విద్యాధికారి తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు చిన్నయ్య, రజీయొద్దీన్ అస్లాం, కనకమహాలక్ష్మి మరో తొమ్మిది సెంటర్లను, హై పవర్ కమిటీ సభ్యుడు శ్రీనాథ్ మూడు కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం నర్సయ్య, బాలాజీ, యమున 22 కేంద్రాలు, బల్క్ అధికారి బుద్ధిరాజ్ మూడు సెంటర్లను తనిఖీ చేశారు. కామారెడ్డిలో జనరల్ విభాగంలో 7,786 మందికి 7,555 మంది హాజరు కాగా.. 231 మంది గైర్హాజరు అయ్యారని ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు. ఒకేషనల్ విభాగంలో 1,444 మందికి 1,308 మంది హాజరు కాగా.. 136 మంది గైర్హాజరు అయ్యారన్నారు. మొత్తం 96.02శాతం మంది విద్యార్థులకు పరీక్ష రాసినట్లు తెలిపారు. కామారెడ్డిలోని శ్రీ ఆర్యభట్ట జూనియర్ కాలేజీలో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ తనిఖీ చేశారు. మాల్ ప్రాక్టీస్‌కు తావు లేకుండా పరీక్షలు నిర్వహించాలని, ప్రతి విద్యార్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం లోపలికి అనుమతించాలని సిబ్బందికి సూచించారు.




## బోధన్ తహసీల్దార్, ఆపరేటర్‌పై కేసు నమోదు

**వారసత్వ భూమి మరొకరి పేరిట మార్పిడి చేసినందుకు..**

బోధన్ రూరల్, మార్చి 5: వారసత్వ భూమిని మరొకరి పేరిట మార్పిడి చేయడంపై బోధన్ తహసీల్దార్, ధరణి ఆపరేటర్‌పై కేసు నమోదు చేసినట్లు బోధన్ రూరల్ పోలీసులు బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. బోధన్‌కు చెందిన మేకల సింధు, సుప్రియ అక్కా చెల్లెళ్లు. వారి తండ్రి శంకర్ గతంలో మరణించాడు. అతడికి పాండుఫారం శివారులో 37గుంటల భూమి ఉన్నది. ఆ భూమిని ఇద్దరు సోదరిలకు ఎలాంటి సమాచారం, ప్రమేయం లేకుండా ఇతరుల పేరిట మార్పిడి చేశారు. ఇందులో తహసీల్దార్ విఠల్, ధరణి ఆపరేటర్ నిఖిల్ బాధ్యులు అని పేర్కొంటూ సింధు, సుప్రియ పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీంతో వారిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు బోధన్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు. కాగా.. భూమి విక్రేతలు, కొనుగోలు దారుల వద్ద ఉన్న ఆధారాల మేరకు స్లాట్ బుక్ చేయించుకొని రావడంతో రెవెన్యూ అధికారులు భూమి పట్టా మార్పిడి చేసినట్లు తెలిసింది.